పచ్చదనం..కొత్తందం

- సనత్‌నగర్‌కే తలమానికం నెహ్రూ పార్కు
- ఆకట్టుకునేలా ప్రవేశద్వారం, గజిబో, ఫౌంటెయిన్లు
- ఆడుకునేందుకు షటిల్, ప్లే కోర్టు
- సౌకర్యవంతంగా వాకింగ్ ట్రాక్

సనత్‌నగర్: ఒకప్పుడు చిన్న చిన్న శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు పరిమితమైన పార్కు, కాలక్రమేణా నిరాదరణకు గురై కనీసం వాకింగ్ చేసే పరిస్థితి లేకుండాపోయింది. పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన క్రీడా సామగ్రి సైతం కనుమరుగైపోయింది. దీంతో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, పేరుకుపోయిన మట్టి దిబ్బలతో ఆ పార్కు వైపు వెళ్లేందుకు ఎవరూ ఆసక్తి చూపించేవారు కాదు. నిన్న మొన్నటి వరకు నిర్వహణ కరువై మూతపడిన సనత్‌నగర్ ఎస్సార్టీకాలనీలోని నెహ్రూపార్కు నేడు కొత్తందాలతో సంతరించుకుంది. మల్టీ జనరేషన్ థీమ్ పార్కుగా అవతరించి కనువిందు చేస్తోంది. 2020లో ప్రారంభమైన ఈ పార్కు పనులు ఎన్నో అడ్డంకులతో ఎట్టకేలకు తుదిదశకు చేరుకున్నాయి.


కనువిందు చేస్తున్న పార్కు అందాలు


పార్కు మధ్యలో చూడముచ్చటైన ఫౌంటెయిన్

రూ.1.35 కోట్ల వ్యయంతో..

గతంలో నెహ్రూ పార్కులో ఉన్న కమ్యూనిటీ హాల్ భవనాన్ని విస్తరించాలని అధికారులు ప్రతిపాదించి పునాది పనులు ప్రారంభించారు. అయితే విస్తరించడం కన్నా ఉన్నదానినే కూల్చి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌గా నిర్మించి ఎస్ఆర్‌టీతో పాటు చుట్టుపక్కల బస్తీవాసులకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ భావించారు. పార్కు కావడం నిర్మాణాలకు అనుమతి లేకపోవడంతో ఆ ప్రతిపాదనను వెనక్కి తీసుకుని మల్టీ జనరేషన్ థీమ్ పార్కుగా చేయాలని మంత్రి నిర్ణయం తీసుకుని ఇందుకోసం 2020లో పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా రూ.1.35 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించారు. కొన్నాళ్లు పనులు బాగానే జరిగినా కాంట్రాక్టర్ పత్తా లేకుండాపోవడంతో పనులు నిలిచిపోయాయి. మరోసారి మంత్రి తలసాని ఈ పార్కుపై సమీక్ష జరిపి మరో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించి వేగవంతం చేసేలా చొరవ తీసుకున్నారు.

ఆధునిక హంగులు చేర్చి..

- పార్కు చుట్టూ శిథిలావస్థకు చేరిన ఫెన్సింగ్‌ను తొలగించి గ్రిల్స్‌తో కొత్తగా ప్రహరీని ఏర్పాటు చేశారు.
- ప్రవేశద్వారం వద్ద అత్యంత ఎత్తులో ఆకర్షణీయమైన ఆర్చ్‌ని నిర్మించారు.
- చిన్నారుల కోసం ప్లే, షటిల్ కోర్టులు ఏర్పాటు చేశారు.
- పార్కు మధ్యలో నిర్మించిన గజిబో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.
- గతంలో చిన్న చిన్న శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించుకునే కమ్యూనిటీ హాల్ (మినీ కన్వెన్షన్ హాల్) భవనాన్ని పూర్తిగా పునరుద్ధరించారు.
- టాయిలెట్ బ్లాక్, జాగింగ్ ట్రాక్, కాస్కెట్ ఫౌంటెయిన్లను నిర్మించారు. ప్రస్తుతం పచ్చదనం, పూలవనం, ఔషధ మొక్కల పెంపకం చేపట్టే పనులు కొనసాగుతున్నాయి.

త్వరలో ప్రారంభం

నెహ్రూ పార్కును మల్టీ జనరేషన్ థీమ్ పార్కుగా మార్చాలనే మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ నిర్ణయం మేరకు పార్కును అన్ని హంగులతో చూడముచ్చటగా ఆధునికీకరించడం జరిగింది. పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ప్రస్తుతం పచ్చదనం పనులు కొనసాగుతున్నాయి. త్వరలోనే పార్కును అందుబాటులోకి తీసుకొస్తాం.

– యతీంద్ర మోహన్, ఏడీఈ


ఆటవిడుపు కోసం షటిల్ కోర్టు


ఆధునికీకరణ అనంతరం నూతన భవనంగా కనిపిస్తున్న మినీ కన్వెన్షన్ హాల్

క్లుప్తంగా

నేడు వసంత పంచమి వేడుకలు

సనత్‌నగర్: వసంత పంచమి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలోని శ్రీసరస్వతీ మాత అమ్మవారి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఈఓ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు అష్టోత్తర శత కలశాభిషేకం, అనంతరం అలంకారం, అర్చన, హారతి, ప్రసాదం పంపిణీ ఉంటాయని పేర్కొన్నారు. అలాగే అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అదే విధంగా 27న ఉదయం 7 గంటలకు శ్రీసరస్వతీ, చండీ హోమాలు ఉంటాయన్నారు.

మినిస్టర్ రోడ్డులో అన్నదానం

సనత్‌నగర్: రాంగోపాల్‌పేట మినిస్టర్ రోడ్డులోని జరిగిన అగ్ని ప్రమాద బాధితులతో పాటు సహాయక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న వివిధ విభాగాల సిబ్బందికి శ్రీనివాస సమాజ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం పంపిణీ చేశారు. కమ్మిలి శేషారావు ఆర్థిక సహకారంతో ట్రస్టీలు పార్థసారథి, కృష్ణారెడ్డి, అరవింద్‌గౌడ్ సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

వైఎస్ షర్మిలకు కేలండర్ అందజేత



ఉస్మానియా యూనివర్సిటీ: వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు ఓయూ పరిశోధన విద్యార్థి వైఎస్సార్‌టీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు గడ్డం ఆదాము ఆధ్వర్యంలో బుధవారం షర్మిలను కలిసి ఓయూ కేలండర్, డైరీని అందజేశారు.

పీహెచ్‌డీ స్కాలర్‌కు సన్మానం

రసూల్‌పురా: ఉస్మానియా యూనివర్సిటీలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ సాధించిన బొల్లారం కేఎల్. ఉదయ్‌కిరణ్‌ను కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జైప్రకాష్ ఘనంగా సన్మానించారు. పారమీటర్ ఆప్టిమైజేషన్ ఆఫ్ టేపర్ కటింగ్ ప్రాసెస్ ఆన్ ఏఐఎస్ఐ డీ–2 స్టీల్ వైర్ ఈడీఎం అంశంపై డాక్టరేట్ లభించింది. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు.

శుభాకాంక్షలు



లాలాపేట: తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన శాంతికుమారిని బుధవారం జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సీసీఎంబీలో యూసుఫ్ హమీద్ కెమిస్ట్రీ క్యాంప్



లాలాపేట: రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఇండియా, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 25 వరకు 9, 10 తరగతి విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ యూసుఫ్ హమీద్ కెమిస్ట్రీ క్యాంప్ కార్యక్రమాన్ని సీసీఎంబీలో నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపుగా 20 పాఠశాలల నుంచి సుమారు 75 మంది విద్యార్థులు పాల్గొన్నారు. దైనందిన జీవితంలో కెమిస్ట్రీ ఏ విధంగా ముడిపడిఉందో చూపించాలనే లక్ష్యంతో ప్రయోగాల ద్వారా విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల్లో కెమిస్ట్రీ పట్ల ఆసక్తిని పెంపొందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని సీసీఎంబీ అధికారులు తెలిపారు.

'క్యాట్' ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

అమీర్‌పేట: నాలెడ్జ్ అసెస్‌మెంట్ టెస్ట్ (క్యాట్) ఫలితాల్లో అమీర్‌పేట ఎస్ఆర్‌నగర్ శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గతేడాది నవంబర్ 27న దేశవ్యాప్తంగా నిర్వహించిన క్యాట్ ఫలితాలను బుధవారం విడుదల చేశారు. ఇందులో శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు మ్యాథ్స్ అసెస్‌మెంట్ టెస్టులో 54 మంది, ఫిజిక్స్‌లో 33, కెమిస్ట్రీలో48 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ లావణ్య తెలిపారు.76 మందికి మెడల్స్, సర్టిఫికెట్స్, 44 మందికి సర్టిఫికెట్స్,15 మందికి నగదు, సర్టిఫికెట్స్, మెడల్స్ పొందారన్నారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్ఐ అనిత, ఏజీఎమ్ శివరామకృష్ణ, జోనల్ కోఆర్డినేటర్ సంతోష్, డీన్ సురేష్ విద్యార్థులను అభినందించారు.

అధునాతన హంగులతో కుట్టివెల్లోడి ఆస్పత్రి

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలోని ప్రస్తుత కుట్టివెల్లోడి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని త్వరలో అధునాతన హంగులు ఏరియా ఆసుపత్రిగా తీర్చిదిద్దనున్నామని శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ పేర్కొన్నారు. సీతాఫల్‌మండిలో నిర్మించనున్న ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించి అంశంపై బుధవారం ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అనిల్‌కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సునిత, వైద్యాధికారులు, సాంకేతిక నిపుణులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఆసుపత్రి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.12 కోట్లు మంజూరు చేయించామని త్వరలో పనులు చేపట్టనున్న నేపథ్యంలో వైద్యుల సలహాలు సూచనలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుత ప్రతిపాదనల్లో మార్పులు చేర్పులు ఉన్నట్లయితే చెప్పాలని అవసరమైతే అదనపు నిధులను ప్రభుత్వం నుంచి ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. నిర్మాణం సమయంలో ఇక్కడ కొనసాగుతున్న వైద్య సేవలను మెట్టుగూడలోని ఒక ప్రభుత్వ భవనంలోకి బదలాయించే అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ, వైద్యాధికారులు డాక్టర్ సక్కుబాయి, డాక్టర్ ప్రేమ, డాక్టర్ నరసింహ, జలమండలి డీజీఎం వై.కృష్ణ, సెక్షన్ ఆఫీసర్ అన్విత్ పాల్గొన్నారు.


వైద్యాధికారులతో చర్చిస్తున్న పద్మారావుగౌడ్

పోస్టర్ ఆవిష్కరణ

సికింద్రాబాద్: జాగృతి మూవీ మేకర్స్ సమర్పణలో రామ్‌నాథ్ మూవీస్ సంస్థ నిర్మిస్తున్న రెంట్ చిత్రం పోస్టర్‌ను బుధవారం పద్మారావుగౌడ్ ఆవిష్కరించారు. శివారెడ్డి, అమిత్‌తివారీ, వనితారెడ్డి పాత్రధారులుగా నటిస్తున్న ఈ చిత్రం త్వరలో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మాత జగ్గయ్య, రాంనాథ్, జగదీశ్, కార్పొరేటర్లు సామల హేమ, రాసూరి సునీత పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదలకు భరోసా


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సాయన్న

కంటోన్మెంట్: తెలంగాణలో వివిధ సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి పేదలకు భరోసా కల్పిస్తున్న ఘటన సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే సాయన్న పేర్కొన్నారు. తిరుమలగిరి, సికింద్రాబాద్ మండలాల పరిధిలోని 59 మందికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను బుధవారం ఆయన అందజేసి మాట్లాడారు. పేదింటి ఆడపడుచుల పెళ్లికి ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తరాదనే ఉద్దేశ్యంతో సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు కేవలం తెలంగాణలో మాత్రమే అమలవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ హసీనా, నేతలు నివేదిత, శ్రీనివాస్, సంతోష్, సదానంద్ గౌడ్, మురళీ యాదవ్, శ్రీనివాస్, నాగినేని సరిత, పెంట శ్రీహరి, కిరణ్, సృజన్ పాల్గొన్నారు.

నేటి నుంచి 'సీపీఆర్'పై అవగాహన కార్యక్రమాలు

గాంధీ ఆస్పత్రి: గాంధీ మెడికల్ కాలేజీ అలుమ్నీ అసోసియేషన్, గ్లోబల్ అలియన్స్, అమెరికన్ హార్ట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గాంధీ ప్రాంగణంలోని అలుమ్నీ భవనంలో ఈ నెల 26 నుంచి మూడ్రోజుల పాటు కమ్యూనిటీ హ్యాండ్స్ ఆన్ కార్డియోపల్మనరీ రిసక్టేషన్ (సీపీఆర్) అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను బుధవారం నిర్వాహకులు ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో ప్రతి ఏటా లక్ష మందిలో 4280 మంది సడెన్ కార్డియాక్ అరెస్ట్‌తో మరణిస్తున్నారని, వీటి శాతాన్ని తగ్గించేందుకు సీపీఆర్ అవగాహన కార్యక్రమాలను గత ఐదేళ్ల నుంచి నిర్వహిస్తున్నామని డాక్టర్ మహేశ్వర్, రవీందర్ సురకంటి, రాజశేఖర్ తెలిపారు. హఠాత్తుగా కుప్పకూలడం, అపస్మారకస్థితికి వెళ్లడం, శ్వాస అందకపోవడ, నాడీ కొట్టుకోకపోవడం, ఛాతీలో నొప్పి తదితర లక్షణాలు గుండెపోటుకు దారి తీస్తాయన్నారు. సడెన్ కార్డియాక్ అరెస్టుకు గురైతే రెండు చేతులతో సీపీఆర్ ప్రక్రియ చేపట్టి బతికించవచ్చన్నారు. బలంగా, వేగంగా ఛాతీ మధ్యలో నిమిషానికి 100–120 సార్లు, 5 సెంటీమీటర్ల లోతులో మర్దన చేయడాన్నే సీపీఆర్ అంటారన్నారు.


వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

పనుల పరిశీలన

అమీర్‌పేట: అమీర్‌పేట డివిజన్ ఎస్ఆర్‌నగర్‌లో జరుగుతున్న మంచినీటి కనెక్షన్ పనులను కార్పొరేటర్ కేతినేని సరళ పరిశీలించారు.బుధవారం కాలనీకి వెళ్లిన ఆమె పనులను పరిశీలించి స్థానికులతో మాట్లాడారు.రూ.2.5 లక్షల వ్యయంతో కొత్తగా మంచినీటి లైన్ వేశారని, పాత కనెక్షన్లను తొలగించి కొత్తగా లైన్‌లో కలుపుతున్నారని పేర్కొన్నారు.



'ఖేలో ఇండియా'కు బాక్సర్ వర్షిత ఎంపిక

రసూల్‌పురా: మధ్యప్రదేశ్ భోపాల్‌లో ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు జరిగే ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు జింఖానా బాక్సింగ్ క్రీడాకారిణి సిల్వారి వర్షిత రాష్ట్రం నుంచి ఎంపికైంది. అండర్–19 విభాగంలో 54–57 వెయిట్ కేటగిరిలో హర్షిత పాల్గొననుంది. ఈ సందర్భంగా కోచ్ మనోజ్ రెడ్డి మాట్లాడుతూ.. జింఖానా మైదానంలో బాక్సింగ్‌లో కఠోర శిక్షణ తీసుకుంటున్న హర్షిత జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి పాల్గొంటుదని, ఇప్పటికే జిల్లా, రాష్ట్రస్థాయిలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో పాల్గొని పలు పతకాలు సాధించిందన్నారు.



బస్తీవాసుల గోడు.. వినండి సారూ..

కంటోన్మెంట్: రక్షణ, ఎయిర్‌పోర్టు భూముల్లో వెలిసిన బస్తీ వాసులకు యాజమాన్య హక్కులు కల్పించాలని టీఆర్ఎస్ నేత ఎస్. శ్రీగణేశ్ డిమాండ్ చేశారు. కంటోన్మెంట్ జీహెచ్ఎంసీలో విలీనం వేళ ఆయా బస్తీల సమస్యను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ మేరకు బుధవారం విలీన కమిటీ సభ్య కార్యదర్శి, సీఈఓ మధుకర్ నాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సుమారు నాలుగు దశాబ్దాల క్రితమే రసూల్‌పురా, అన్నానగర్ పరిధిలోని ఎయిర్‌పోర్టు భూముల్లో బస్తీలు వెలిసినా నేటికీ పట్టాలకు నోచుకోలేదన్నారు. ఆక్రమిత స్థలాల్లో ఉన్నారన్న సాకుతో ఈ బస్తీల్లోని సుమారు 45 వేల మంది ఓట్లను తొలగించారని ఇప్పుడు తగిన హామీ ఇవ్వకపోతే నివాసాల ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ స్పందించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఈ అంశంపై విలీన కమిటీలోని సభ్యులందరికీ లేఖలు రాస్తామన్నారు.


మధుకర్ నాయక్‌కు వినతి పత్రం ఇస్తున్న శ్రీగణేశ్

ఓయూ గేట్ల మూసివేత సమయం పొడిగించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ప్రవేశానికి గేట్ల మూసివేత సమయాన్ని పొడిగించాలని విద్యార్థులు, ఉద్యోగులు వీసీ ప్రొ.రవీందర్‌ను కోరారు. రాత్రి 8 గంటలకే గేట్లు మూసేస్తే వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లి వచ్చేవారు ముఖ్యంగా మహిళలు, వికలాంగులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. క్యాంపస్‌లో హాస్టల్ మెస్‌లు 9.30 వరకు కొనసాగుతున్నందున రాత్రి 10 గంటల వరకు గేట్ల మూసివేత సమయాన్ని పొడిగించాలన్నారు.

బస్టాండ్‌లో ఆక్రమణలను తొలగిస్తాం

సనత్‌నగర్: బస్టాండ్‌లలోని ఆక్రమణలను తొలగించి అన్ని మార్గాల్లో బస్సులు రాకపోకలు సాగించేలా చర్యలు చేపడుతామని కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆక్రమణలను తొలగించకపోవడంతో సనత్‌నగర్ నుంచి వివిధ మార్గాల్లో బస్సుల పునరుద్ధరణ జరపలేకపోతున్నామని ఆర్టీసీ అధికారులు ఫిర్యాదు స్పందించిన కార్పొరేటర్ ఈ విషయాన్ని మంత్రి తలసాని దృష్టికి తీసుకువెళ్లి ఆక్రమణల తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. బుధవారం కొలను బాల్‌రెడ్డి, బస్టాండ్ పరిసరాలను పరిశీలించారు. ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్, కాచిగూడ రూట్లలో బస్సులు పునరుద్ధరించకపోవడంపై ఆర్టీసీ అధికారులను కార్పొరేటర్‌ను సంప్రదించగా ఆక్రమణలను తొలగించకపోవడంతో ఆలస్యం అవుతుందని వాటిని తొలగిస్తే మిగతా రూట్లలోనూ బస్సులు నడుపుతామని స్పష్టం చేయడంతో ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం జరిగేలా చూస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి


ప్రతిజ్ఞ చేస్తున్న బీజేపీ నాయకులు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సామల హేమ

అడ్డగుట్ట: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులు సూచించారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని తుకారాంగేట్ బోయబస్తీ కమ్యూనిటీ హాల్లో బుధవారం స్థానికులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. అర్హులై ఓటు హక్కు లేని వారందరూ వెంటనే నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైందన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ట్యాక్స్ బిల్ కలెక్టర్ సతీష్, ఇతర జీహెచ్ఎంసీ సిబ్బందితో పాటు కంటి వెలుగు వైద్య బృందం, ఆర్పీ స్వరూప పాల్గొన్నారు.

సనత్‌నగర్ పరిధిలో..

సనత్‌నగర్: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సనత్‌నగర్‌లో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కన్నూరి క్రాంతికుమార్ పిలుపునిచ్చారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా బుధవారం ఆయన ఆధ్వర్యంలో భారతదేశ పౌరులమైన మేము, ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, మన దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతామని, మతం, కులం, వర్గం, భాష ఒత్తిళ్లకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికలో నిర్భయంగా ఓటు చేస్తామంటూ పౌరులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో దయానంద్, సునీల్‌కుమార్, చంద్రకుమార్, నరేష్, రాజనీష్ కుమార్, సరితాగౌడ్, మాధవి, శివ, రమేష్ పాల్గొన్నారు.

- బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు ఓటరు దినోత్సవంలో పాల్గొని ఓటు హక్కు సద్వినియోగం చేసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఓటరు దినోత్సవంలో కార్పొరేటర్ సామల హేమ హాజరై ఓటు హక్కు–వినియోగం అంశంపై ప్రసంగించారు. ఓటర్లందరినీ తమ హక్కును వినియోగించుకునే విధంగా జాగృతం చేయాలని విద్యార్థులు, అధ్యాపకులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.10 వేల ఫీజును తగ్గించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో వన్‌టైం ఛాన్స్ పరీక్షకు హాజరయ్యే డిగ్రీ విద్యార్థుల రూ.10 వేల ఫీజును తగ్గించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు బుధవారం రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణకు వినతి పత్రం ఇచ్చారు. వన్‌టైం ఛాన్స్‌లో పదివేల ఫీజు చెల్లించలేని వందలాది పేద విద్యార్థులు పరీక్షలకు దూరం అవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతి ఇచ్చిన వారిలో సత్య, బాలరాజు, శ్రవణ్, శేఖర్, సాయి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సనత్‌నగర్: ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) సనత్‌నగర్ డివిజనల్ కార్యాలయం కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్న ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని అసోసియేషన్ ప్రాంతీయ సలహాదారు అల్లారం క్రీస్తుదాస్ ప్రకటించారు. అసోసియేషన్ సలహాదారుడిగా ఈ.సుధాకర్‌రావు, అధ్యక్షులుగా మనోజ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఎస్.శుద్దోధన్, కార్యదర్శిగా ప్రమోద్‌కుమార్, అదనపు కార్యదర్శిగా విజయ్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా ఎం.అశోక్, కార్య నిర్వాహక కార్యదర్శిగా ఎన్.అనిత, కోశాధికారిగా ఎం.జ్యోతి, సభ్యులుగా ఆర్‌జే సత్యనారాయణ, వైవీ కృష్ణదాస్, కే శ్యామ్‌సన్ నియమితులయ్యారు.

హుండీల ఆదాయం లెక్కింపు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం హుండీలను బుధవారం అధికారుల సమక్షంలో లెక్కించారు. 28 రోజుల మొత్తం హుండీల ద్వారా రూ.30,01,779 ఆదాయం వచ్చినట్లు ఈఓ అన్నపూర్ణ తెలిపారు.

డీఏ మంజూరుపై హర్షం

గాంధీఆస్పత్రి: ప్రభుత్వ ఉద్యోగులకు డియర్‌నెస్ అలవెన్స్(డీఏ) ప్రకటించడం పట్ల తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) గాంధీ యూనిట్ హర్షం వ్యక్తం చేసింది. అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ రాజేశ్వరరావు, భూపేందర్‌రాథోడ్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఒక డీఏ 2.73 శాతం ప్రకటించిన సీఎం కేసీఆర్, వైద్యమంత్రి హరీష్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. మిగిలిన రెండు డీఏలను వెంటనే ప్రకటించాలని, ఇప్పటికే పరిపాలన అనుమతి పొందిన ప్రభుత్వ వైద్యుల యూజీసీ ఎరియర్స్‌కు సంబంధించిన జీవోలను విడుదల చేయాలన్నారు.

విదేశీ విద్యార్థుల ప్రవేశ ప్రకటన విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో 2023–24 విద్యా సంవత్సరానికి విదేశీ విద్యార్థుల ప్రవేశాల ప్రకటన బుధవారం విడుదల చేశారు. డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు ఫిబ్రవరి 1 నుంచి మే 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఫారెన్ రిలేషన్ డైరెక్టర్ ప్రొ.అప్పారావు తెలిపారు. ఏప్రిల్ నుంచి ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు జరగనున్నట్లు వెల్లడించారు.